## ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

**గ్రీవెన్స్‌లో మహిళ ఫిర్యాదు**

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : కొందరు వ్యక్తులు ఇంటి మీదికి వచ్చి దాడి చేశారని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని సోమవారం ఓ మహిళ ప్రజావాణిలో విన్నవించుకున్నది. బాధితురాలు అంగోత్ విజయలక్ష్మి కథనం ప్రకారం.. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని సాలార్‌తండాలో నివాసముంటున్న విజయలక్ష్మి నాగార్జున ఆటో ఏజెన్సీ నుంచి హోండా వాహనాన్ని రూ.95 వేలకు ఫైనాన్స్‌లో కొనుగోలు చేసింది. అడ్వాన్స్‌గా రూ.23వేలు చెల్లించి మిగతావి ప్రతి నెలా రూ.4,330ల చొప్పున వాయిదాల్లో చెల్లిస్తున్నది. కొద్ది రోజుల తర్వాత ఆరెంజ్ ఏజెన్సీ నుంచి కొటక్ మహేంద్ర బ్యాంకుకు ఫైనాన్స్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ప్రతి నెలా అందులో కిస్తీలు కడుతున్నా రసీదు మాత్రం ఇవ్వడం లేదు. కాగా, ఈ నెల 11న నలుగురు వ్యక్తులు ఇంటికి వచ్చి బండికి కిస్తీ కట్టడం లేదని, వెంటనే కట్టాలని ఆమెను బెదిరించారు. తన భర్త లేడని చెప్పినా వినకుండా ఎంతో కొంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయినా డబ్బులు ఇవ్వకపోవడంతో బండిని తీసుకెళ్తుండగా విజయలక్ష్మి అడ్డుపడింది. మహిళ అని చూడకుండగా ఫైనాన్స్ ఏజెన్సీవారు ఇష్టమున్నట్లు తిడుతూ ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు విచారణ లేదని, అసలే పట్టించుకోవడం లేదని విజయలక్ష్మి పేర్కొన్నారు. వెంటనే విచారణ చేసి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

## ప్రతి ఒక్కరూ డప్పుతో కదిలి రావాలి

మహబూబాబాద్ రూరల్ : వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేల గొంతులు, లక్ష డప్పుల' సభకు జిల్లాలోని దండోరా సోదరులు పెద్ద ఎత్తున డప్పులతో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల వీరయ్య కోరారు. సోమవారం మండలంలోని జమాండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ దండోరా ఉద్యమాన్ని స్థాపించి 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమస్యలపై కూడా పోరాటాలు చేసి అనేక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. వర్గీకరణ అంశం తుది దశకు వచ్చినా ప్రభుత్వం అమలు చేయనందుకు నిరసనగా హైదరాబాద్ నిర్వహించే ఈ సభ ద్వారా మాదిగల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రేణుక, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పాషా, జ్యోత్స్న, శివ, గోవర్ధన్, రాజయ్య పాల్గొన్నారు.

## బంగారం షాపులో పట్టపగలే చోరీకి యత్నం

**పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు**

కేసముద్రం : మండల కేంద్రంలోని ఓ బంగారం షాపులో పట్టపగలే చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్సై మురళీధర్‌రాజ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన పిట్టల సాయి అనే వ్యక్తి ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న గాయత్రి జ్యుయలరీకి వచ్చి బంగార గొలుసు కావాలని యజమానిని అడిగారు. రూ.లక్షా20వేల విలువైన తులంన్నర బంగారు చైన్‌ను యజమాని సాయికి చూపించాడు. సాయి దానిని మెడకు పెట్టుకొని పరిశీలిస్తున్నట్లుగా అద్దంలో చూసి జేబులో వేసుకొని పరిగెత్తాడు. గమనించిన యజమాని దొం గా.. దొంగా.. అంటూ సాయి వెనక పరిగెత్తాడు. గమనించిన స్థానికులు వెంబడించి సాయి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బంగారం షాపు యజమాని ఫిర్యాదు మేరకు సాయిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

## అన్నారంలో..

కేసముద్రం, జనవరి 27 : మండలంలోని అన్నారం గ్రామంలో ఒకరి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాకూబ్, అతడి భార్య సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి, సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న అరతులం బంగారం, 10తులాల వెండి, రూ.6వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీ

బయ్యారం, జనవరి 27 : ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీకి గురైన ఘటన మండలంలోని భీమ్లాతండాలో జరిగింది. వివరాల్లో వెళితే.. భీమ్లాతండాకు చెందిన నలుగురు రైతులు సాగు నీటి అవసరాల కోసం సుమారు రూ.3 లక్షలతో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవలే స్తంభాలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినా సాంకేతిక కారణం వల్ల ప్రారంభించలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న 50 కిలోల కాపర్ వైరు అపహరించారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ సుమన్ సందర్శించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిపార్ట్‌మెంట్ ద్వారా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని అధికారులు సూచించారు.

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ సుమన్

# మన్యం చేరని 'మహాలక్ష్మి'

- బస్సు సౌకర్యం లేక ఏజెన్సీ గ్రామాల మహిళల అవస్థలు
- చార్జిలు పెట్టుకొని ఆటోల్లో ప్రయాణించటంతో ఆర్థిక భారం
- మంత్రికి విన్నవించినా పరిష్కారం కానీ సమస్య
- కాంగ్రెస్ తీరుపై మహిళల అసంతృప్తి

బస్సు సౌకర్యం లేక ఆటోలో వెళ్తున్న మహిళలు

బయ్యారం : మహాలక్ష్మీ పథకం మన్యానికి చేరడం లేదు. కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం గిరిజన మహిళలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. బయ్యారం మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో సుమారు వంద వరకు గ్రామాలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా గిరిజన ప్రజలే నివసిస్తున్నారు. బయ్యారం, కొత్తపేట, నామాలపా డు, జగ్గుతండా, సంత్రాలపోడ్‌తండా, ధర్మపురం గ్రామాలకు తప్ప.. ఇతర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజన మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఏజెన్సీ గ్రామాలకు చెందిన వారు వివిధ పనుల నిమిత్తం నిత్యం మండలకేంద్రంతోపాటు మహబూబాబాద్, ఇల్లందు, ఖమ్మం వంటి చుట్టుపక్కల ఉన్న పట్టణాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఈ క్ర మంలో మండల కేంద్రానికి చేరుకోవాలంటే తప్పనిసరిగా ఆటోలను ఆశ్రయించి చార్జిలు చెల్లించడంతో వారిపై ఆర్థికభారం పడుతున్నది. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో (జిల్లా పరిషత్ పాఠశాలలు, కళాశాలలు) విద్యార్థులు పక్క గ్రామానికి వెళ్లాల్సి వస్తున్నది. ఈ సమయంలో బస్సుసౌకర్యం లేక సైకిళ్లపైనే బడికి వెళ్తున్నారు. బయ్యారం సమీపంలో ఉన్న మానుకోట, ఇల్లందు లో నియోజకవర్గాల్లో రెండు ఆర్టీసీ బస్సు డిపోలున్నా బ య్యారం ఏజెన్సీ గ్రామాల్లో పరిస్థితి మెరుగుపడడం లేదు. చార్జిలు లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించిన ప్రభు త్వం తమ గ్రామాలకు బస్సు సౌకర్యం ఎందు కు ఏర్పాటు చేయలేదని, తాము ఓట్లు వేయలేదా..?, మహాలక్ష్మీ పథకానికి అర్హులం కాదా..? అని ప్రభుత్వాన్ని నిలదీ స్తున్నారు.

**మంత్రి, ఎమ్మెల్యే కు విన్నవించినా తీరని సమస్య...**

బయ్యారం ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని మండల పర్యటనకు వచ్చిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పలు గ్రామాల ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. మహాలక్ష్మీ పథకాన్ని తాము వినియోగించుకోలేక పోతున్నామని, తద్వారా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. నెల రోజుల క్రితం ఎమ్మెల్యే కోరం కనకయ్య, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి, ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాని విన్నవించారు. అయితే, నెల రోజులు గడుస్తున్నా బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ప్రభుత్వం తీరుపై గిరిజన ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**బస్సులు లేక ఇబ్బంది పడుతున్నాం..**

మా గ్రామానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్నాం. పని నిమిత్తం బయటికి వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మీ పథకం పెట్టినా మాకు ఉపయోగం లేదు. ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ సేవలు విస్తరిస్తే గిరిజన ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– రమణ (నారాయణపురం)

## ఆ ముగ్గురే నా చావుకు కారణం

- పురుగుల మందు తాగి.. సెల్ఫీ వీడియోలో మాట్లాడి..
- చికిత్స పొందుతూ మృతి
- ముగ్గురిపై కేసు నమోదు

పగడాల సతీశ్ (ఫైల్)

డోర్నకల్, జనవరి 27: పురుగుల మందు తాగి.., 'నా చావుకు ఆ ముగ్గురే కారణం' అని సెల్ఫీ వీడియోలో మాట్లాడి, వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేసి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తోడేళ్లగూడెం గ్రామం లో సోమవారం జరిగింది. సీఐ రాజేశ్ కథనం ప్రకారం.. తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన పగడాల సతీశ్ (27) ఈ నెల 24న ఇసుక ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన సుంకరి వెంకన్న, అతడి కొడుకులు పవన్, చరణ్ అడ్డుపడి మా పొలం నుంచి వెళ్లొద్దని గొడవపడ్డారు. సతీశ్ వెంటనే ట్రాక్టర్‌ను తిప్పుకొని వెళ్లాడు. వాస్తవానికి ఆ పొలాన్ని వెంకన్న కౌలుకు చేస్తున్నాడు. మరుసటి రోజు సతీశ్ ఇంటి ముందు నుంచి వెంకన్న వెళ్తుండగా, మా ఇంటి రోడ్డుపై నుంచి వెళ్లొద్దని ముళ్లకంప వేశాడు. ఇరువురు పరస్పరం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసుకున్నారు. కాగా, అన్ని విషయాల్లో వెంకన్న, అతడి కొడుకులు పవన్, చరణ్ తనకు అడ్డుపడుతున్నారని ఈ నెల 26న మధ్యాహ్నం 3.15 గంటలకు కస్నాతండా వెళ్లే రోడ్డులో పురుగుల మందు తాగి, సె ల్ఫీ వీడియోలో 'నా చావుకు సుంకరి వెంకన్న, అతడి కొడుకులు పవన్, చరణ్ కారణమని, నా కుటుంబానికి న్యాయం చేయాలని మాట్లాడి, వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. కుటుంబ సభ్యులు సతీశ్‌ను ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. సతీశ్ తల్లి రాణమ్మ ఫిర్యాదు మేరకు వెంకన్న, అతడి కొడుకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సతీశ్‌కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్‌టోప్పో అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో 15 సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేపట్టి అంపూర్తిగా వదిలేశారని, వెంటనే దానిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని గ్రామానికి చెందిన ఖాదర్‌బాబా, సంతోష్, కృష్ణ, వెంకన్న అదనపు కలెక్టర్‌ను కోరారు. కారోబార్‌గా పని చేస్తున్నానని తనకు 8 నెలలుగా వేత నం అందడం లేదని కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన గణేశ్ గ్రీవెన్స్ వినతి పత్రం అందజేశారు. వివిధ మండలాల నుంచి మొత్తం 165 దరఖాస్తులు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మధుసూదన్‌రాజ్, వెంకటేశ్వర్లు, నరసింహస్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

## శుభోదయం నూతన కార్యవర్గం

శ్రీనివాస్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : శుభోదయం సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అసోసియేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీకాంతారావు, కోశాధికారిగా పాపయ్య, ఉపాధ్యక్షులుగా కీర్తనారెడ్డి, చాగంటి కిషన్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సంతోశ్, ప్రచార కార్యదర్శిగా వీరస్వామిని ఎన్నుకున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గార్ల : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై రియాజ్‌పాషా అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ నడిపేవారు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు.

## గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే రైల్వే గేట్‌బంద్

గార్ల : గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే రైల్వే గేట్ ఈ నెల 27 నుంచి 31 వరకు బంద్ చేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే పనుల్లో భాగంగా గేట్‌మూసి వేస్తున్నట్లు తెలిపారు. బుద్దారం ఆర్‌యూబీ నుంచి వెళ్లాలని సూచించారు.

## తూతూ మంత్రంగా సోషల్ ఆడిట్

మరిపెడ, జనవరి 27 : మండలంలో ఉపాధి పథకంపై నిర్వహిస్తున్న గ్రామ సభలు తూ..తూ మంత్రంగా సాగుతున్నాయి. సోమవారం మండలంలోని పాముబండ తండా, భూక్యా తండా, గాలివారిగూడెం, గిరిపురం, అజ్మీరా తండా, ఎలమంచలి తండాతో పాటు వివిధ గ్రామాల్లో పని చేసిన వారికి హాజరు లేకపోవడం, చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో కొందరు అధికారులను నిలదీశారు.

## మిర్చి తోటలో క్షుద్ర పూజల కలకలం

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని కొమ్ముగూడెం తండాలో ఓ మిర్చి తోటలో క్షుద్రపూజలు చేసిన ఘటన సోమవారం కలకలం రేపింది. బాధితుడు మల్సూర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ముగూడెంతండా శివారులో మల్సూర్‌కు రెండు ఎకరాల మిర్చి తోట ఉంది. గత అక్టోబర్‌లో మిర్చితోట మధ్యలో కోడిని చంపి, పాతిపెట్టి తోట చుట్టూ మక్కలు, పసుపు వేశారు. మళ్లీ గత రాత్రి మిర్చి తోటలో కోడిని పాతి పెట్టి ఇదే విధంగా కుంకుమ, పసుపు చల్లి వెళ్లారు. సోమవారం పొద్దున్నే మల్సూర్ తోట వద్దకు వెళ్లగా, క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో భయపడి ఇంటికి వెళ్లాడు. నెల రోజులకొకసారి గుర్తు తెలియని వ్యక్తులు ఈ విధంగా చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## నేడు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి క్విజ్ పోటీలను మంగళవారం మండల శివారు అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని, ప్రతి స్కూల్ నుంచి ఒక్కరి చొప్పున పంపించాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9849598281నంబరును సంప్రదించాలన్నారు.

## 'లక్ష పుస్తకాలు ఇవ్వండి'

మహబూబాబాద్ రూరల్ : లక్ష డప్పులు కాదు.. లక్ష పుస్తకాలు ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. సోమవారం పట్టణంలో మాల మహానాడు జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేధావులు అనే వారు రాజకీయ లక్ష్యం కాకుండా మాల మాదిగల భవిష్యత్‌కు పునాది వేయాలన్నారు. లోతైన అధ్యయనం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని, మోదీకి నిజమైన ప్రేమఉంటే మొదటగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దారకుమార్, ఐలయ్య, జయపాల్, భరత్, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : మానుకోట డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు 8500324880 నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

## ధరల పట్టికను ప్రదర్శించాలి

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రతి ప్రైవేట్ హాస్పిటల్‌లో తప్పనిసరిగా ధర పట్టికను ప్రదర్శించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు ప్రైవేట్ దవాఖానల్లో ఆకస్మికంగా తనిఖీలో చేశారు. సత్యసాయి హాస్పిటల్ వారు ధరల పట్టిక ప్రదర్శించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులను జారీ చేశారు. దవాఖానల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ సారంగం, విజయ్, శ్రావణ్, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

## బందోబస్తు నడుమ ఏకలవ్య పనులు

గూడూరు, జనవరి 27 : ఏకలవ్య పాఠశాల పనులు సోమవారం పోలీస్ బందోబస్తు నడుమ ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో రూ.35 కోట్లతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏకలవ్య పాఠశాల పనులకు శంకుస్థాపన చేశారు. కాగా, పాఠశాల నిర్మిస్తున్న స్థలం తమదేనని, అక్కడ వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులు అభ్యంతరం తెలుపుతూ కోర్టుకు వెళ్లారు. పాఠశాల నిర్మాణానికి అనుమతులు రాగా, గ్లోబ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం పోలీసులు బందోబస్తు నడుమ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించింది.

## చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బయ్యారం : చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి తెలిపారు. బయ్యారం మండలం చోక్లతండాలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఆంప్లిఫైర్ చోరీ చేశారు. స్థానికుడు రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రామాలయం సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు బైక్‌పై వెళ్తున్న జగ్నితండాకు చెందిన అజ్మీరా వీరన్న, బాలాజీపేటకు చెందిన ధరావత్ ప్రవీణ్‌ను ఆపి తనిఖీ చేశారు. వారు వద్ద ఆంప్లిఫైర్‌ను గుర్తించి, ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## విచారణ చేపట్టిన డీసీహెచ్ఎస్

గూడూరు, జనవరి 27 : నర్సుపై డాక్టర్ చేయి చేసుకున్న ఘటనలో డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఫర్ హెల్త్ సర్వీస్) బీ వెంకటరాములు సోమవారం విచారణ చేపట్టారు. సోమవారం ఉదయం సీహెచ్‌సీకి చేరుకున్న ఆయన ముందుగా జరిగిన ఘటనపై దవాఖానలోని ఇతర వైద్యులు, సిబ్బందిని పిలిచి ఆరా తీశారు. అనంతరం నివేదిక తయారు చేసి కలెక్టర్, వైద్యవిధాన పరిషత్‌కు పంపనున్నట్లు తెలిపారు.

## కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

తొర్రూరు : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి వెంకన్న నేతృత్వంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ.. 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇంకా అమలు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికుల వేతనాలను పెంచి, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మంగళపల్లి రామస్వామి, నాయకులు కుమార్, ఉప్పలయ్య, చంద్ర మ్మ, శివ, నరసింహ, సోమయ్య, శేఖర్ మురళి, రాములమ్మ పాల్గొన్నారు.

## ఐక్యత సభను జయప్రదం చేయండి

తొర్రూరు, జనవరి 27 : ఖమ్మంలో జరిగే పీడీఎస్‌యూ ఐక్యత సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు గొడిశాల మనోజ్ కోరారు. ఈ మేరకు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సమతా ఐటీఐ కాలేజీలో సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సందీప్, వెంకటేశ్, రాజు, పూర్ణప్రసాద్, సాయి, ఆకాశ్, శివ, రాకేశ్, వంశీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన

నెల్లికుదురు : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై చిర్ర రమేశ్‌బాబు అన్నారు. జాతీయ రహదారి రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నెల్లికుదురు పోలీసు శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత

ఇనుగుర్తి : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు చిర్రగోని కిరణ్‌గౌడ్ అదే గ్రామానికి ఇద్దరు దివ్యాంగులకు రూ. 16వేల విలువ చేసే ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పిల్లలమర్రి కవిత, దాసరి ధర్మయ్యకు దాతల సహకారంతో ట్రై సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. వారు చిర్రగోని కిరణ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన మిర్చి తీసుకురావాలి

కేసముద్రం : తేమశాతం తక్కువగా ఉన్న చెత్తలేని మిర్చిని విక్రయానికి తీసుకొచ్చి గరిష్ఠ ధర పొందాలని మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. పంట ఉత్పత్తులను రైతులు మార్కెట్‌లోనే విక్రయించాలని, బయట అమ్ముకోవద్దని సూచించారు. తాలు మిర్చిని వేరు చేసి తీసుకొస్తే అధిక ధర పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ చిదురాల వసంతరావు, వ్యాపారులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఓలం మురళి, శ్రీరాం కిరణ్‌కుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

## ఒకరిపై కేసు నమోదు

మరిపెడ, జనవరి 27 : మహిళను వేధించిన ఒకరిపై సోమవారం కేసు నమోదు అయినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మండలంలోని గిరిపురం రెవెన్యూ పరిధిలోని ఇటుకలపాడు తండా చెందిన వివాహితను అదే తండాకు చెందిన భూక్యారెడ్డి కొద్ది రోజుల నుంచి వేధిస్తున్నాడు. తట్టుకోలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.

NT-327012-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

నర్